
# వెలి



దీపాలు గూట్లె పెట్టే యాల్ల. వీపు మీదున్న బట్టల ముల్లెను కిందికి దించి అలసటగా కూర్చుంది రామవ్వ. కాళ్ళు చేతులు లాగుతున్నాయి. ఇరవై మూడిండ్ల కట్టుబట్టల్ని ఉతికి ఆరేసి నేరల్లమడుగు నుండి మోసుకు రావడం వల్ల నడుములో నొప్పిగా ఉంది. వెన్ను విరిచి మూల్గుతూ గోడకు ఒరిగింది.

అత్తను చూసి పెద్దకోడలు మూతి విరిచింది. పక్కనే కూర్చుండి బీడీలు చేస్తున్న రెండవ కోడలు 'ఈమెను ఎవలుతుక్క రమ్మన్నరు..? ఎవలు మూల్గుమన్నరు?యాడనన్న ఇరుగవడితే ఏంజేత్తదటా!' అన్నది గొణుగుతున్నట్టుగా. ఆ మాటలు విని ఇంట్లోంచి బయటకు వచ్చింది చిన్నకోడలు. వణుకుతున్న చేతులతో బట్టలముల్లెను విప్పింది.

"సదువుకున్నోని కంటే సాకలోడు నయమంటరు. ఏ బట్ట ఎవలదని యాదికుంచుకుంటడు. సాకలీర్కానికి, కాయికానికి సదువేంపని జెయ్యది. నీకు ఏ బట్ట ఎవలదని తెల్వది. పక్కకు జరుగు. నేను పంచేసుకుంట." కోపంగా అన్నది రామవ్వ. భయపడుతూనే పక్కకు జరిగింది నీరజ.

"చూసినవా..? చిన్న కోడలుకు గవ్వెత్తు పనితలుగనియ్యది. పుట్టెడుకువ్వారముంది." యారాలు వైపు చూస్తూ మెల్లిగా అంది రెండవ కోడలు నర్సవ్వ.

"మొగన్ని, చేసుకునేటప్పుడు ఎరుక లేదా? సాకలోన్ని చేసుకుంటే సాకలి పని చెయ్యాలని! రేపు ఎరువడ్డంక గుల్లవట్టుకొని ఊరు తిరుగదటనా? ముల్లెవట్టుకొని సాకరికిపోదటనా?"

వెటకారంగా అన్నది పెద్దకోడలు ఎల్లవ్వ.

ఆమాటలు రామవ్వకు వినపడ్డాయి. తలెత్తి కోడళ్ళ వైపు చూసింది. వాళ్ళ చూపుల్లో భయంలేదు. పశ్చాత్తాపం లేదు. 'నువ్వు వినాలనే అన్నాం' అన్నట్టుగా ఉన్నాయి. రుసరుసలాడుతూ ముల్లె విప్పి బట్టలన్నింటిని వేరు చేసింది. అప్పటికే చీకటి పడింది. ఇండ్లల్లో బట్టలు ఇచ్చిరావాలి. అన్నం అడుక్కురావాలి. రెండు పనులు ఒకేసారి చేయాలంటే కుదరదు. బట్టలిచ్చి అన్నం అడిగితే రైతులు తిడతారు. 'చావు బట్టలు తెచ్చినట్టు అన్నమడుక్కునే యాల్లకు బట్టలు తెత్తావే! పొద్దుగూకక ముందే ఇచ్చి, రాత్రి బువ్వకు రావాలె' అంటారు. మిగిలిన చాకలి వాళ్ళందరూ అలాగే చేస్తారు.

భుజం మీద నాలుగిండ్ల బట్టలేసుకుని మిగిలిన బట్టల్ని కుప్పలుగా వేసి బయటకు నడిచింది రామవ్వ. వాటిని చూసి కోపంగా అన్నది ఎల్లవ్వ. అత్తకు వినిపించేట్టుగా.

"ఆ బట్టల్ని ఎవలిచ్చుత్తరట. ఇక్కడ వంతు పెట్టిపోయింది. మేం కూసుంటున్నమా? రోజు వెయ్యి బీడీలు చేసి కట్టలుకట్టే వరకు నడుము టింగుమంటుంది."

రామవ్వకు కూడా కోపం వచ్చింది. వెనక్కి తిరిగి "గన్ని బట్టలు నేనొక్కదాన్ని ఎట్లిచ్చిరావాలెనే! ఊరు తిరిగే వరకు నడిజాము రాత్రిగాదా -? మీరు చేరోదిక్కుపోయి ఇచ్చి అన్నమడుక్కత్తె తప్పానే!' అన్నది.

'మేం చేసేది కనవడుతలేదా? ఇక్కడ వట్టిగ తినుకుంట ఎవలుకూసుంటుంర్రు. ఆ మాటకత్తే ఎవలిండ్లు వాళ్ళకు వంతు పెట్టు. అప్పుడేర్పడుతది సంగతి. యారాలు చిన్నదైతే పాలు చిన్నదైతదా!" నర్సవ్వ అన్నది.

"మీరెందుకిట్ల జేత్తంర్రోనాకు తెలుసునే! దానికి పని జెయ్యరాదనేగదనే.... ఆ నల్ల మొఖపోడు సచ్చే ముందు నన్ను మంది కండ్లళ్లేసిండు. మీకు ఎప్పుడు ఏరు వడుదామా అన్నట్టుంది. ఏం సంపాయించుకుంటరే! ఆడోల్లు మొగోల్లు ఇద్దరూ ఒక్కటే మాట. మొదటి నుంచి గిట్లుంటే నేనేం జేత్తుంటి! పెట్టింది తిన్నరు. చెప్పింది చేసింర్రు." అంటూ బట్టల్ని సర్దుకుంటూ ముందుకు నడిచింది. నీరజ రెండు మొగురాల మధ్య నిలబడి కళ్లు తుడుచుకుంది.

కరెంటు లేదు. కళ్లు పొడుచుకున్నా కనబడని చీకటి. వానకాలం కావడం చేత నేలంతా తడిగా ఉండి జారుతుంది. చేతి కర్రతో పొడుస్తూ గొణుక్కుంటూ నడుస్తుంది రామవ్వ మూడు వీధుల్ని దాటి రెడ్డి కాపులుండే వీధిలోకి అడుగు పెట్టింది. సత్తిరెడ్డి ఇంట్లో బట్టలిచ్చి వెనక్కి తిరిగింది.

"ఏందేరామి...? గింత చీకట్ల ఎట్ల తిరుగుతున్నవే! గుర్రాలోలె కొడుకులున్నరు. కోడండ్లున్నరు. వాళ్ళేంజేత్తుంర్రే...? యాడనన్న ఇరుగవడితే మల్లలేత్తవాయె? కాలో చెయ్యో ఇరుగుతది. నోట్లెమన్ను వడ్డట్టయితది." సత్తి రెడ్డి భార్య వెంకటమ్మ అన్నది.

"ఏం జెయ్యాలెనవ్వా! ఏరు వడి సంపాయించుకుంటరట. ఏరువడుతరట. ఎడమకు వెడితేకుడికి వెడుతుంర్రు. కుడికి వెడితే ఎడమకు వెడుతుంర్రు. ఆగమాగం జేత్తుంర్రు." బాధగా అన్నది రామవ్వ.

కొత్తకోడలు గురించి ఆసక్తిగా అడిగింది వెంకటమ్మ. తన బాధనంతా చెప్పుకుంది రామవ్వ. 'వాడు దాన్ని యాడ కూడిండే' అంటూ వివరాలన్ని అడిగింది. 'అది మాకు దూరపు సుట్టమైతది. వాళ్ళకు మాకు మాటల్లేక ఏండ్లు దాటినయి. రెడ్ల కులంల పుట్టి సాకలోల్ల వాకిలి

సాకుతుంది. మైలబట్టలు ఉతుకుతదటనాయే నీ కోడలు' అంటూ నవ్వింది వెంకటమ్మ.

'నీ కొడుకు మాదిగిండ్లల్ల పట్టు పడితే ఎవలకన్న తెలువనిచ్చిండ్రా. లొట్ల దొంగతనం జేస్తే ఎవలన్న నోరెత్తిండ్రా. నా కొడుకు మీకులందాన్ని లగ్గం జేసుకుంటే మీకు నవ్వులాటగైంది. మీ ఇండ్లల్ల ఏం జరిగినా అది ఒమ్మిపోతుంది. మా ఇండ్లల్ల పచ్చిపులుసుల పోపు పెట్టినా పది మందికెరుకైతుంది.' మనసులోనే అనుకుని అక్కడి నుండి కదిలింది రామవ్వ.

వాకిట్లోకి రాగానే కాలుజారింది. నిలదొక్కుకోవాలని ప్రయత్నించింది రామవ్వ. ఆమె ప్రయత్నం ఫలించలేదు. భుజం మీది బట్టలు కిందపడ్డాయి. వెల్లకిలా విరుచుకు పడిపోయింది. ఆ చప్పుడుకు ఇంటి ముందుకు టార్చ్‌లైట్‌తో వచ్చింది వెంకటమ్మ. బయటకు వెళ్ళిన సత్తిరెడ్డి కూడా అప్పుడేవచ్చాడు. ఎప్పుడోపోయిన కరెంటు కూడా వచ్చింది. చుట్టపక్కల వాళ్లంతా పోగయ్యారు. రామవ్వను లేపి కూర్చోబెట్టారు. కాలు వడితిరిగి పోవడంతో నొప్పిపుట్టి నిలబడలేకపోయింది రామవ్వ.

వెంటనే కొడుకులకు విషయం చెప్పారు. ఇద్దరు కొడుకులు వచ్చి తల్లిని తీసుకుపోయారు. పెద్దకొడుకు కాస్త ఆలస్యంగా వచ్చాడు. సత్తిరెడ్డిఅతడిని పిలిచి తల్లిని చీకట్లో ఊళ్లోకి పంపినందుకు చీవాట్లు పెట్టాడు.

"ఇప్పుడు అగ్గిరగాండ్ల దవాఖానకు తీసుకపోతే వెయ్యిరెండు వెయిలన్న గావాలె. చూసుకుంట చూసుకుంట ముసలి దానికాలు ఇరగ్గొడితిరి. ఇండ్లల్ల పెండ్లాలెంజేత్తుండ్రురా" కోపంగా అన్నాడు సత్తిరెడ్డి.

"తప్పంత మా అవ్వదే పటేలా! ఎవల తవ్వేడు వాళ్ళకు పోసి ఎవల ఇండ్లు వాళ్ళకిస్తే ఎవలంతల వాళ్ళు ఉతుక్కుంటరు గదా!" మా తమ్ముడు కుల కషిపి చెయ్యడట. బట్టలు ఉతకనన్నడట. వాడు అట్ల ఏనాడు అన్నడో ఇండ్లన్నీ మా ఇద్దరికే పంచియ్యి. మేమే ఉతుక్కుంటం. వాని ఇష్టమున్న పని చేసుకబతుకనీ అని చెప్పినం. వాడు ఏంతింటడురా? అని ఎనుకముందయితుంది." చెప్పాడు ఎల్లయ్య.

సత్తిరెడ్డికి ఎల్లయ్య చిన్న తమ్ముడు మాట్లాడే తలబిరుసు మాటలు, ప్రేమ, పెళ్ళి అన్నీ గుర్తొచ్చాయి. వెంటనే ఎల్లయ్యతో అన్నాడు మీసాలు మెలివేస్తూ రహస్యం చెబుతున్నట్టుగా.

"ఎల్లుగా! నువ్వు వట్టి మెత్తటి సన్నాసివిరా. ఇద్దరు ఆడిపోరగండ్లున్నరు. ఎట్ల బతుకుతవో ఏమో! వాని వంతుకొచ్చిన ఇండ్లు మీరెందుకు ఉతుకుతరురా! వాడు మీద మీద ఊర్లె తిరుగుతడు. మీరు చెడపుట్టినట్లు లెవ్వంగనే మైల బట్టలతో సాకరికి పోతరు. మీ పెండ్లాలోలె వాని పెండ్లాంగూడా ఊరు తిరిగి బట్టలడుక్కరావాలె. నీకొక మంచి ఉపాయం చెబుత. ఇప్పుడు ఇంటికి పోంగనే మీకున్న ఇండ్లను మూడు పాల్లుజెయ్యి. నా ఇల్లు, సర్పంచ్ నారంరెడ్డిఇల్లు, పోలీస్‌పటేల్ ఇల్లు..... ఇట్ల మంచి మంచి ఇండ్లు నాలుగైదు కలిపి మీ చిన్న తమ్మునికియ్యి. ఎవలన్న చూత్తే తమ్మునికి మంచి మంచి ఇండ్లు ఏరిచ్చిండన్న మంచి పేరు నీకొస్తది. వాడు మా బట్టలు ఎట్ల ఉతుకడో మేం జూస్తం."

ఎల్లయ్యకు నిజమేననిపించింది. ఇంట్లో భార్యతో పోరుపడలేకుండా ఉన్నాడు. వెంటనే ఈ పద్ధతి అమలు చేయాలనుకున్నాడు. ఎవరెవరికి ఏయే ఇండ్లు ఇవ్వాలో మనసులోనే లెక్కవేసుకున్నాడు. ఇంటికి వెళ్ళగానే తల్లిమీద ఒత్తిడి తెచ్చాడు. ఎవరిండ్లు వాళ్ళకు పంచిస్తే తప్ప రేపు బట్టలు ఎవరూ ఉతుకరని మొండికేసాడు.

ఇద్దరు కొడుకుల్ని చెరిన్ని ఇండ్లు పంచుకొమ్మని చెప్పింది రామవ్వ. సత్తిరెడ్డి మాటలు తలకెక్కడంతో ఒప్పుకోలేదు ఎల్లయ్య. 'వాడు ఎన్నడు కష్టం జేసిండు. ఇన్ని రోజులు కూసుండవెట్టి సాదితిమి. కొన్ని రోజులు సదువుసదువనే తిరిగె. కొన్ని రోజులు దవాఖానల పని నేర్చుకుంటున్న అనె. ఇప్పుడు గూడా వాని ఇండ్లు మేమెందుకు ఉతుకుతం. మనకు భూమి జాగలుంటే పంచుకోకపోదుమా. ఇండ్లు కూడా పంచుకోవాలె. వానివంతు కొచ్చిన ఇండ్లు వానిష్టం' అన్నాడు. భర్తవైపు మెచ్చుకోలుగా చూసింది ఎల్లవ్వ.

రామవ్వ మనసు కుతకుతలాడింది. ముగ్గురు కొడుకుల్ని దగ్గరకు పిలుచుకుంది. తండ్రి చనిపోయిన్నుండి ఎన్ని కష్టాలు పడిందో, వాళ్ళమీద ఎన్ని ఆశలు పెట్టుకుందో చెప్పింది. ఊరంతా చిన్న కొడుకును ఎలా పగ బట్టిందో చెబుతూ-

"ఎల్లముూ.... యాదగిరీ... తమ్ముడు చిన్నోడు బిడ్డా. తెలిసో తెలియకనో పెద్దకులం పిల్లను లగ్గం జేసుకున్నడు. ఆ మాత్రం దానికే మన ఊరంతా కోడైకూత్తుంది. పెద్ద కులం ఖరాబైనట్టు, మనం తప్పుజేసినట్టు మాట్లాడుతుండ్రు. మీకు చెప్పేటోల్లు ఏదో చెబుతుండ్రు. అదంతా ఓర్వలేని తనమే బిడ్డా! కులం తక్కువోనికి, పేదోనికి ఇంతమంచి పెండ్లామా? అనుకుంటుండ్రు. మన ఇంట్ల చిచ్చుబెట్టి ఆగమాగం జెయ్యాలనుకుంటుండ్రు. పెద్ద కులపోల్లు ఎసొంటోల్లో నాకు తెల్వదా బిడ్డా! మంచి ఆడది కనబడితే ఓర్వరు. వాళ్ళండ్ల వాళ్లకు ఎన్ని కొట్లాటలున్నా కులం కులమంతా ఒక్క మాటమీదుంటరు. ఒక్క అవ్వ కడుపుల పుట్టిన మీరెందుకు బిడ్డా! వాళ్ల మాటలు పట్టి ఏరువడుతరు. పడితే పడ్డారనుకో! మీ దాంట్ల మీరు సర్దుకోవాలె. వాడు ఊర్లె దవాఖాన పెట్టి డాక్టరు పని జేత్తడట. వానికొచ్చిన పని వాడు చేసుకుంటడు. ఇండ్లను మీరిద్దరు పంచుకొని ఉతుక్కోండ్రి. ఎరంవడ్లు మీరే తీసుకోండ్రి." అన్నది రామవ్వ.

ఇద్దరు కొడుకులు ఆమె మాటలు వినలేదు. తమ్ముడి పెళ్ళి చేస్తే వచ్చే కట్న కానుకలతో అప్పులన్ని తీర్చవచ్చున్న వారి ఆశ తీరకపోవడంతో వాడితో మాకేంపని అనుకుంటున్నారు. కట్నం ఎక్కువగా వస్తదనే ఆశతోనే ఇంటర్మీడియెట్ పూర్తికాగానే ముస్తాబాద్‌లో ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ వద్ద ఉంచి పని నేర్చుకోమన్నారు. రామవ్వ మాటలతో పని లేకుండానే ఇండ్లను పంపకాలు చేసారు. వారు వేసిన ఎత్తుగడను పసిగట్టింది రామవ్వ. అది వారికి పుట్టిన బుద్ధికాదని కూడా గ్రహించింది. ఏంజరుగుతుందోనని భయం పట్టుకుందామెకు.

మరునాడు కోడళ్లిద్దరూ ఒడిగట్టుకుని తమకు పంచి ఇచ్చిన ఇండ్లకు వెళ్ళి అన్నం కూర బట్టలు అడుక్కొచ్చారు. పిల్లలకు పెట్టుకుని తాము తిన్నారు. వారిని కూడా సముదాయించాలని చూసింది రామవ్వ. వారు వినలేదు. ఎవరిదారిన వారు బట్టల ముల్లెతో సాకర్లకాడికి వెళ్ళారు. తన ఆరోగ్యం బాగున్నా మిగిలిన ఇండ్ల బట్టలు ఉతుక్కుని వచ్చేది. మంచంలోంచి లేచి నడువలేక బాధపడుతూ కూర్చుంది.

ఆ రోజు ముఖ్యమైన వాళ్లిండ్లకు సాకలి వెళ్ళలేదు. అప్పటికే సత్తిరెడ్డి వారందరిని కలిసి విషయం చెప్పాడు. సర్పంచ్, పట్వారీ, రెడ్డి సంఘం పెద్ద మనుషులు ఏదో తప్పు జరిగినట్టు కోపంతో సమావేశాలు జరిపారు. చాకలి కుల పెద్దల్ని పిలిపించి మాట్లాడారు. ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో చెప్పారు. కుల పెద్దలు రామవ్వ ఇంట్లో సమావేశమయ్యారు. ఏం చెయ్యాలో తెలియక గాబరా పడుతూనే చిన్న కొడుక్కి ధైర్యం చెప్పింది రామవ్వ.

"ఒక్క రోజుకి ఏం మునిగిపోయిందట. మేం మనుసులంగాదా! మాకు రోగాలు రావా! జారి అడ్డంబడ్డ. పాణం మంచిగైనంక ఉతుకుతనని చెప్పుండ్రి. పెద్దకులపోల్లయి నాలుగిండ్లు ఉతుకక పోతెనే కులమంత ఒక్కటయింది. మన దగ్గర ఆ దమ్మెక్కడుంది. మనండ్ల మనమే కొడ్మైతిమి. నాచిన్న కొడుక్కు ఇష్టం లేదట. వాడు ఉతుకడట. వానిబుద్దున్న పని వాడు చేసుకుంటడు. తాతలు తండ్రుల నాటి నుంచి తరతరాలు బట్టలుతికే బతుకుతమని కాయితం రాసిచ్చినమా ఏంది? వాళ్ళు ఎద్దు ఎవుసం ఇడిసిపెట్టి దుకాండ్లు పెట్టుకుంటలేరా! యాపారం జేత్తలేరా? నౌకర్లు జేత్తలేరా? నా కొడుకును జూసెవరకు ఓర్వ బుద్దయితలేదు. వాళ్ళకే కాదు మీకు గూడా!" అంటూ కులపెద్దల్ని దులిపేసింది.

ఆమె మాటలు వారిలో మరింత కక్షను పెంచాయి. మరునాడే గ్రామ పెద్దలందరూ సమావేశమయ్యారు. సాకలి వాళ్లల్లో పెద్ద మనుషుల్ని రామవ్వ ఇద్దరు కొడుకుల్ని పిలిపించారు. 'వాడెందుకు బట్టలుతుకడు? వాడు సాకలోడుగాదా..?' అంటూ ప్రశ్నించారు.

చివరికి ఎల్లయ్య తమ్ముడి వంతుకు బట్టలుతకడానికి ఒప్పుకున్నాడు కానీ సత్తిరెడ్డి, సర్పంచ్ ఒప్పుకోలేదు. వాడు బట్టలుతికే వరకూ కరంటు కట్ చెయ్యాలని, నల్లా నీరు ఇవ్వకూడదని, వాడిని కులం నుండి వెలివేయాలని తీర్మానించారు. రామవ్వ పోలీసు కేసుపెడతాననడంతో తీర్మానం అమలు ఆగిపోయింది. వేదింపులు మాత్రం ఆగిపోలేదు. ఇండ్లల్లో మురికి బట్టలు పేరుకుపోతున్నాయి.

సత్తిరెడ్డికి తనమాట పారడం లేదన్న కోపం పెరిగిపోయింది. ఊరందరిని ఏకం చేసాడు. అన్ని కులాల పెద్దల్ని పిలిపించుకుని మాట్లాడాడు. "ఈ రోజు బట్టలుతుకనని వీడన్నాడు. రేపు ఇంకొకడంటాడు. మరొకడు మా బట్టలు మీరే ఉతుకుండ్రి అంటాడు. ఇప్పుడు ఏమాత్రం అలుసు ఇచ్చినా వాళ్ళు మన నెత్తికెక్కి కూర్చుంటారు. అందుకే మనమంతా ఒక్కటి కావాలి. వాడు మన బట్టల్ని ఉతుకుతాను అనే దాక మనమంతా సాకలోల్లకు బట్టలెయ్యద్దు. అడుక్క తినే సాకలోనికి ఇంత నీలుగుడా!" అన్నాడు.

అతడి మాటల్ని గట్టిగా బలపరిచాడు సర్పంచ్. "మన ఇండ్లల్ల సచ్చినా బతికినా వాళ్ళకు పండుగనే. ఒక్క మేకను కోత్తె కాలు తలకాయ అర్రల బొత్త మాదేనంటరు. చిన్న కార్యమైనా కట్నాలంటరు. పొద్దుమాపు అన్నం అడుక్కపోతరు. ఏపండుగొచ్చినా కూరలు, కల్లుసీసలు, అప్పాలు ఇచ్చుడేనాయె. ఆరు నెలలు గడిస్తే పంటపండినా పండకపోయినా జంటకు ఇద్దుము వడ్లు పెట్టుడేనాయె. ఇట్ల పెట్టినా ముక్కిటు మూతి అటు. వీల్లు కాకుంటే వేరే ఊరినుండి తెత్త. ఆకలైతే గుల్లం వరిగడ్డి మేస్తదన్నట్టు నాలుగురోజులు బందువెడితె మిగిలినోల్లంతా 'నీకొడుకు చెయ్యవట్టె గిట్లయిందని' రామవ్వ ఇంటిముందు కూసుంటరు. అప్పుడు తెలుస్తది. మనతడాకా ఏంటిదో!" మీసం మెలివేస్తూ అన్నాడు.

మరునాడు చాకలి వాళ్ళకు ఎవరూ బట్టలు వేయరాదని, వేస్తే వేయిరూపాయల జురుమానా కట్టాలని చాటింపు వేయించారు. అదివిని కలవరపడిన చాకలి వాళ్ళు సర్పంచ్‌ను కలిసారు. విషయమంతా చెప్పి వారందరినీ రామవ్వ ఇంటికి పంపించాడు సర్పంచ్. వాడొక్కడు తప్పు చేస్తే మమ్మల్నందరినీ వద్దనడం న్యాయంకాదని ఎంతగా బ్రతిమాలినా వినలేదు. మీ ఇండ్లను తలా ఒకటి మేమే పంచుకుంటామన్నారు. వాడే ఉతకాలని పట్టుబట్టాడు సర్పంచ్.

కులమంతా రామవ్వ ఇంటిముందు గుమికూడారు. మీతమ్ముడు తప్పకుండా బట్టలుత

కాల్సిందేనని ఎల్లయ్యను, యాదగిరిని భయపెట్టారు. రామవ్వకు అరికాలి మంట నెత్తికెక్కింది.

"వాని బుద్ధి. మీరెవరు వాన్ని బట్టలుతకమననీకి. మీ బుద్దుంటే ఉతుకుండ్రి లేకుంటే లేదు. ఏ కులపోళ్లు అదే పనిల బతకాలన్నదేముంది. వాళ్ల ఇండ్లల్ల పండుగైతే మన్నింట్ల అయినట్టు పనులు జేత్తం. వాళ్ళమురికిని ఎత్తిపోత్తం. యాడికి పొమ్మంటే అటుపోతం. ఏ పనంటే ఆపనిజేత్తం. ఇయ్యాల్ల మనం ఎదురు తిరుగుతున్నమని వాళ్ళు భయపడుతుండ్రు. అందుకే మిమ్ముల్ని నా మీదకు ఎగదోసిండ్రు." అంటూ సర్పంచ్ ఇంటికి వెళ్లింది. పెద్దకొడుకు తల్లిని ఆసరా పట్టుకున్నాడు.

"అయ్యా! సర్పంచ్ బాపూ! మీ తాతలు తండ్రులప్పుడు మాతాతలు తండ్రులు ఎట్టి జేసిండ్రు. బాంచెను కాల్లు మొక్కుతనని మీ చెప్పులు మోసిండ్రు. ఎడ్లకచ్చురాల ముందట కుక్కలలెక్క ఉరికిండ్రు. బట్టలుతికినా, ఇండ్లకు సున్నాలేసినా పెండ్లీలకు, చావులకు ఊర్లు తిరిగినా నయా కొత్త ఇయ్యలేదు. ఆ ఎట్టి మాదగ్గరికొచ్చే వరకు తగ్గిపోయింది గని బట్టలుతికే పని తప్పలేదు. ఇప్పుడు నా కొడుకు ఈ బట్టలు గూడా ఉతుకనంటుండు. అది వానిష్టం. అదేదో పెద్ద తప్పయినట్టు మీరు కులపోల్లందరిని మామీదికి ఎగదోసిండ్రు. మీరు మనసులొకటి పెట్టుకుని ఇట్ల జేత్తండ్రని నాకు తెలుసు. మీరు చేసేదేముంది. మాంటే కులంలకెల్లి ఎల్లగొట్టి కులంలేకుండ జేత్తరు. ఎవ్వలేంది నాకు జేసేది. నేనే కులాన్ని ఎల్లగొడుతున్న. మీ కాపుదనపు ఇండ్లల్లనే గుడిసేసుకుని ఉంట. నన్ను ఎవ్వలేంజేత్తరోసూత్త." మూడు తొవ్వలకాడ నిలబడి గాయికెత్తుకుంది రామవ్వ.

ఎల్లయ్య ఎంతగా సముదాయించాలన్నా వినడంలేదామె. కోపంగా ఇంటివరకు పట్టుకొచ్చి తల్లని కూడా చూడకుండా నోటికొచ్చినట్టు తిట్టాడు. 'నువ్వా నీచిన్నకొడుకు ఎక్కడికైనా పొండ్రి. ఈ ఇంట్ల ఉండద్దు. మాకు ఉరితేవద్దు' అన్నాడు.

రామవ్వ బిర్రు మాటలకు కులమంతా ఒక్కటయి కన్నెర్రజేసింది. వాళ్ళతో ఎవరూ మాట్లాడకూడదని నిర్ణయించుకున్నారు. ఒక్క క్షణం కూడా ఆ వాడలో ఉండకూడదని హెచ్చరించారు. తల్లి తమ్ముడి వైపే మాట్లాడ్డం కొడుకులకు కోపాన్ని తెచ్చింది. కొడుకుల కోపం కులానికి బలాన్నిచ్చింది. ఇలా చేస్తేనైనా ఊరివారి మద్దతు లభిస్తుందనుకున్నారు. సత్తిరెడ్డి, సర్పంచ్, శాంతించి ఊరుకుంటారనుకున్నారు. ఈ విషయం చెప్పడానికి వారింటికి పరుగులు తీసారు.

వారి అంచనా తప్పయింది. రామవ్వను లొంగదీసుకోనందుకు వారిపై విరుచుకు పడ్డారు పెద్దమనుషులు.

"ఇన్ని రోజులు మాతో మీరు, మీతో మేము బతికాము. ఇప్పుడు మీదాంట్ల ఒకడు బట్టలు ఉతుకనంటే మీరు వాన్ని ఏమీ చేయలేకపోయారు. మీతో మాకేందని మీరంటున్నప్పుడు అదే మాటను మేమంటున్నాం. మా ఇష్టమున్నట్టు జేస్తం. మీ తిక్క ఎలా తిరిగి పియ్యాలో అలా తిరిగిపిత్తం" అన్నాడు సత్తిరెడ్డి. భయం భయంగా ఇంటి మొహం పట్టారు చాకలివాళ్ళు.

మరునాడు పక్కనే ఉన్న ఊరిలోంచి కొంతమంది చాకలివాళ్ళతో బట్టల్ని ఉతికి ఇచ్చే షరతు మీద ఒప్పందం కుదుర్చుకున్నారు. ఊరు దగ్గరగానే ఉండడంతో పొద్దున వచ్చి సాయంత్రం వెళ్లిపోయేవారు. చాకలి వాళ్ళకు దిగులు పట్టుకుంది. మొదటిసారిగా చేతులు ముంగట పెట్టుకుని పనిలేక కూర్చుంటున్నారు.

పక్క ఊరి నుండి వచ్చిన వాళ్ళను వెళ్ళిపొమ్మని బ్రతిమాలడం మొదలెట్టారు. ఎవరు తెచ్చారో వారు వెళ్ళిపొమ్మంటే వెళ్తామన్నారువారు. పెద్దమనుషులుగా పేరున్న వారంతా వారివైపే

మాట్లాడ్డంతో ఊరి చాకలి వాళ్ళు నీరసించిపోయారు. రామవ్వపై ఆమె చిన్నకొడుకుపై పగను పెంచుకున్నారు. ఇదంతా సర్పంచ్, సత్తిరెడ్డి కలిసి ఆడిన నాటకమని తెలిసాక మరోసారి వారి వాకిట్లోకి వచ్చి గొంతు చించుకుంది రామవ్వ.

"పటేలా... మీరు రెడ్లు.. ఎడ్లు ఎవుసం ఉన్నోళ్ళు. మీ కులవృత్తి ఎవుసం. మరి మీ కొడుకు యాపారమెందుకు జేత్తుండు? మీ అల్లుడు కల్లు మావులాలు ఎందుకు గుత్తపడుతుండు? తెనుగు తెంకరోల్లు జేసుకునే తోటలు గుత్తపట్టేపని మీ చిన్నల్లుడెందుకు జేత్తుండు. చిప్పల కాయల లారీలు ఎందుకు కొంటడు...? మీ ఎవుసం ఎందుకు మూలపడ్డది? మీరు మీ ఇష్టమున్న పనులు చేసుకోవచ్చు! మేము మాత్రం మీ మైల బట్టలుతుక్కుంటనే ఉండాలె. కాదు కూడదంటే కులం బందంటరు. మీ కులంల ఉన్న కట్టు మాకులంల లేదు. గందుకనే మీకు అలుసు. మాకులపోల్లు పెద్ద పెద్ద మీసాలు వడివెట్టుకుంట మీ కాళ్లకాడికే వచ్చిరి."

సత్తిరెడ్డి మారుమాట్లాడలేదు. ఎక్కడ పావునుకదుపాలో అక్కడనే కదిపాడు. రెండు రోజుల్లో చాకలి వాళ్లంతా ఒక్కటయ్యారు.

"రామవ్వ కొడుకు జెయ్యవట్టె మనం ఉపాసముంటున్నం. ఇన్ని రోజులు ఊరికి ఆడిబిడ్డ లెక్కబతికినం. పొద్దుమాపు తిండి దొరికింది. పసలు పసలుకు వడ్లు దొరికినయి. చిన్నగనో పెద్దగనో కట్నాలు దొరికినయి. ఇయ్యాల్ల ఉత్తచేతులోల్ల మైనం. ఊర్లెకు కొత్త సాకల్లోల్లచ్చింద్రు. కూటికి గతిలేనోళ్ళు వాళ్ళు. ఇదే సర్గం లెక్క కనబడుతుంది వాళ్లకు. నాలుగురోజులాగితే ఊర్లెపాలు గావాలంటరు. అందుకే మనం జెట్టన వాళ్లను ఎల్లగొట్టాలె. రామవ్వ కొడుకులు కోడండ్లు ఊర్లెకెళ్ళి ఎల్లిపోతె మనను ఊర్లెకు రానిత్తరట.'' కుల పెద్ద కులాన్ని కూర్చోబెట్టి చెప్పాడు.

రామవ్వ ఇద్దరు కొడుకులు 'మీతోనే మేముంటం' అంటూ తల్లిని తమ్ముని తిడుతూ సత్తిరెడ్డి సర్పంచ్‌ను బ్రతిమాలి కులంలో చేరిపోయారు. రామవ్వ, చిన్నకొడుకు, కోడలు ఒంటరిగా మిగిలిపోయారు. తల్లివైపే ఉండాలని ఇద్దరు కొడుకులకు మనసులో ఉన్నా ఇంట్లో భార్యల పోరు, ఆకలితో పిల్లలు అలమటిస్తున్న తీరు, వారిని వెనక్కి లాగాయి. అందరు కలిసి రామవ్వను ఊరినుంచి తరిమేయాలని నిర్ణయించు కున్నారు.

రామవ్వ నోరు విప్పలేదు. తనవంతు పొలాన్ని అమ్మింది. కొడుకుల నుండి ఇంట్లో వాటా డబ్బుల్ని తీసుకుంది. చిన్నా చితకా అప్పుల్ని తీర్చేసింది. తనకు వచ్చే బాకీలన్ని వసూలు చేసుకుంది. మెడలో ఉన్న పూస, పోగును అమ్మి కొడుకు కోడలుతో బస్సెక్కింది.

అందరూ రామవ్వ వెళ్ళిపోయిందనుకున్నారు. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. తమలో తాము సంబరపడిపోయి సర్పంచ్‌ను, సత్తిరెడ్డిని కలిసారు. రెడ్లు మాత్రం ఉడుక్కున్నారు. ఆమె కొడుకు, కోడలు మెడలు వంచి బట్టలుతికించడమే వారి ఉద్దేశ్యం. "మొహం మీద కొట్టినట్టు ఊళ్లో నుండి వెళ్లిపోయింది." అనుకున్నారు. వారికొక కొత్త ఆలోచన వచ్చింది. రామవ్వ పొలాన్ని కొన్న వ్యక్తిని పిలిచి డబ్బు ఇవ్వకూడదని హెచ్చరించాడు. ఇలాగైనా ఊర్లోంచి వెళ్ళిపోతుందని డబ్బు మొదలే ఇచ్చానన్నాడతడు. వారు కన్నెర్రజేసి వేరే ఊరి నుండి వచ్చిన చాకలి వాళ్లను ఎగదోసారు.

రెడ్ల బలంతో ఊరిలో తమక్కూడా వాటాకావాలన్నారు వారు. ఇద్దరి మధ్యాఘర్షణ జరిగింది. మాటా మాటా పెరిగి కొట్టుకున్నారు. కేసు పోలీస్‌స్టేషన్ వరకు వెళ్ళింది. ఇరు వర్గాలపై

కేసులు పెట్టారు పోలీసులు. అప్పులు  చేసి, ఆస్తులు అమ్మి, తమ వాళ్లను విడిపించుకోవడానికి బంధువులు స్టేషన్‌కు  చేరుకున్నారు. ఊరి చాకలి వాళ్లనుండి ఎక్కువమొత్తాన్ని లంచంగా తీసుకున్నాక వేరే ఊరినుండి వచ్చిన వారిని ఊరువిడిచి వెళ్లిపోవాలని హెచ్చరించారు పోలీసులు.

వారం రోజుల తర్వాత కొడుకు కోడలుతో ఊర్లోకి అగుడుపెట్టింది రామవ్వ. వస్తూ వస్తూ రెడ్ల ఇండ్ల మధ్యలో ఉన్న దేవిరెడ్డి ఇంటిముందు ఆగింది. రెండేండ్లుగా అది తాళం వేసి ఉంది. వారు పట్నంలో ఉంటున్నారు. తనను వింతగా చూస్తున్న వారి వైపు మొహం చిట్లించి చూస్తూ  తలుపు తెరిచి ఇంటిని శుభ్రం చేసింది. ఇంటి చుట్టూ అడ్డదిడ్డంగా పెరిగిన మొక్కల్ని పీకేసింది. అప్పటికే ఆమెను వింతగా చూస్తున్నారు చుట్టుప్రక్కల వాళ్లు. ఎవరు చెప్పారో పెద్దకొడుకు పరిగెత్తుకుని వచ్చాడు. అతడి తలకు గాయం ఉంది. తల్లిని చూడగానే మీదపడి ఏడ్చాడు.

“ఎవలు ఎసొంటోల్లో ఇప్పుడు ఎరుకయిందిరా! నేను ఎల్లిపోంగనే ఊరును అప్ప జెప్పుతరనుకున్నవు. ఏం జేసింర్రో చూసినవా! పుర్రెలు పుర్రెలు పగులగొట్టుకునే గతి తెచ్చింర్రు. వాళ్లు పగపట్టిన పాములురా. పాము కరిత్తే ఇసమెక్కుతది. వీల్లు నాకుతేనే ఇసమెక్కుతది. అప్పుడు ఊర్లెకెల్లి వెళ్ళి పొమ్మన్నరు. ఇప్పుడేమంటారు? ఏనల్ల మొఖపోడన్న నోరెత్తుతాడురా! ఇంతవరదాక సాకలిండ్లల్లనే ఉన్న. ఇప్పుడు వీల్ల ఇండ్ల మధ్యలుంట. వీల్లు ఇన్నేండ్లు ఊరును దోసుక తినుకుంటూ చేయలేని పనిని నా కొడుకుతో చేపిస్త. వీడు రేపటి నుండి ఈ ఊర్లె డాక్టర్ పని జేస్తడు. పేదోల్లకు వట్టిగనే మందులు గోలీలిస్తడు...” అంటూ పెద్దకొడుకు దగ్గరగా వచ్చి కడుపు మంట కొరకు కన్న తల్లిని ఎల్లగొట్టినా, ఆకలి బాధ ఎరుకున్న దాన్ని బిడ్డా! నిన్నెట్ల తప్పుపడుతరా! తమ్మునికి దెబ్బలు గిట్ల తలిగినయా!’ అన్నది.

ఎల్లయ్య మరోసారి బావురుమన్నాడు. స్టేషన్ చుట్టూ తిరగడానికి, హాస్పిటల్‌కు చేసిన అప్పులు గుర్తొచ్చాయతనికి •